

5

వర్ధన్నపేట మండల లిస్టులో
**అక్షరదోషాల తడాఖా**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 224 గురువారం 27 నవంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్

## సాఫ్రస్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**అభివృద్ధిలో మరో మైలురాయి**

**ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ**



**హైదరాబాద్ / శంషాబాద్‌నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
సాఫ్రన్ సంస్థ తన ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రన్ సంస్థ, ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా%శా% బుధవారం హైదరాబాద్ జీఎంఆర్ ఎయిరోపార్క్ (ఎస్ఈజెడ్)లో నెలకొల్పిన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ప్రధాని మోడీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ%శా%హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారిందని చెప్పారు మిగతా 2లో...

# కృషాజలాల కేటాయింపులపై పునఃసమీక్షకు అంగీకరించం


**కృష్ణా జలాలపై హక్కును వదులుకోబోమని చంద్రబాబు స్పష్టం**

**జలాల కేటాయింపులపై పునఃసమీక్షకు అంగీకరించేది లేదని వెల్లడి**

**కేంద్రం ముందు బలమైన వాదనలు వినిపించాలని అధికారులకు ఆదేశం**

**వరద జలాలను మాత్రం సామరస్యంగా పంచుకోవడానికి సిద్ధమని ప్రకటన**

**జలవనరుల శాఖ అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష**



**అమరావతి,నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ హక్కులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జలాల కేటాయింపులపై ట్రైబ్యునల్ చేపట్టిన పునఃసమీక్షను అంగీకరించబోమని ఆయన తేల్చిచెప్పారు. అమరావతిలో జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కేంద్రం వద్ద రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అయితే, వరదల సమయంలో వచ్చే నీటిని మాత్రం సామరస్యపూర్వక వాతావరణంలో పంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

# నేటి నుంచి నామినేషన్లు



**పారదర్శకంగా సర్పంచ్ ఎన్నికలు**

**మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు**

**అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు : ఎస్ఈసీ రాణికుముదిని**


# దూసుకొస్తున్న సెన్యార్ తుఫాన్

**తుపాన్‌గా బలపడిన తీవ్రవాయుగుండం.**

**ఏపీకి వర్ష సూచన.. పలు జిల్లాలకు అలర్ట్**

**మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని వార్నింగ్**

**తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు**



అమరావతి,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర- వాయువ్య దిశగామిగతా 2లో...

# నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలా?

**విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటు**

**ఇలాగైతే రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది**

**తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**




హైదరాబాద్,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరుమిగతా 2లో...




# రేవంత్ మిషన్ కమీషన్

**రూ.50 వేల కోట్ల విద్యుత్ స్కాంశా%ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం**

**బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు..కాదంటే విచారణ జరపండి : మాజీమంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్**నవంబర్ 26 :**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మొన్న దేశంలోనే పెద్ద భూకుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందన్నారు. ఇప్పుడు రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణానికి రేవంత్ సర్కారు రూపకల్పన చేసిందని చెప్పారు. ఆధారాలతో సహా బయటపెడుతున్నామని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల మిగతా 2లో...

# చంద్రబాబుకు రైతుల ఉసురు తగులుతుంది

**కూటమి పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదన్న జగన్**

**టన్ను రూ.30 వేలు పలికిన అరటి ఇప్పుడు రూ.2 వేలకే పరిమితమైందని ఆవేదన**

**18 నెలల్లో రైతులకు ఒక్క రూపాయి ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వలేదని విమర్శ**



అమరావతి,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లో రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని, కూటమి ప్రభుత్వ పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అరటి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మిగతా 2లో...

# కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



# ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

**ఢిల్లీ సంవిధాన్ సదన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభ**

**ఆయా భాషల్లో ప్రచురించిన రాజ్యాంగ డిజిటల్ వర్షన్ విడుదల**



న్యూఢిల్లీ :**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమానికి హాజరైన వారితో భారత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. తెలుగు, ఒడియా, అస్సామీస్, కాశ్మీరీ, బోడో,మిగతా 2లో...

# దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు

**కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం**

**అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు**

**19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం**

**రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్**

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్విని వైష్ణవ్**



**న్యూఢిలీనవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్.మిగతా 2లో...

# మున్సిపాలిటీల విలీనం దారుణం

**అవినీతి అనకొండ సిఎం రేవంత్**

**మండిపడ్డ మాజీ మంత్రి కెటిఆంర్**



**వరంగల్,నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నదమ్ములు, అనుయాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా మార్చడం జరిగింది.మిగతా 2లో...

# దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమతులు సహా మొత్తం రూ. 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను ప్రకటించారు. అరుదైన భూమి అయస్కాంతాలతో పాటు, ప్రభుత్వం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా ఆమోదించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్-కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్ లకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా కనెక్టివిటీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అత్యధిక బడ్జెట్ కలిగిన పూణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనున్నారు. 32 కిలోమీటర్ల కొత్త లైన్ వేయడానికి వీలు కల్పించింది కేంద్రం. ఈ మార్గం ఖరడి నుండి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుండి మాణిక్ బాగ్ వరకు నడుస్తుంది. ఇది పూణే మెట్రో నెట్‌వర్క్‌ను 100 కిలోమీటర్లకు పైగా విస్తరిస్తుంది. ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడుతున్న పూణే నివాసితులకు ఇది ఒక పెద్ద ఉపశమనం. భవిష్యత్ సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం అరుదైన భూమి శాశ్వత మాగ్నెట్ (%=జూవీ%) పథకాన్ని ఆమోదించింది. దీని కోసం రూ. 7,280 కోట్ల బడ్జెట్ కేటాయించింది. భారతదేశంలో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు. ఈ కొత్త ప్రణాళిక భారతదేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల ఉత్పత్తికి పూర్తి దేశీయ పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుంది. ప్రస్తుతం, ఈ రంగంలో మనం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాము. ఈ నిర్ణయం భారతదేశాన్ని స్వావలంబన చేస్తుంది. గుజరాత్ యాత్రికులకు కూడా కేంద్రం శుభవార్త తెలిపింది. ఓఖా నుండి కనాలస్ రైల్వే లైన్‌ను డబుల్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ. 1,457 కోట్లు ఖర్చవుతుంది. 159 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్ దేవభూమి ద్వారకకు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచుతుంది. ఈ లైన్‌ను రెట్టింపు చేయడం వల్ల సరుకు రవాణా రైళ్లు వేగంగా నడపడానికి వీలు కలుగుతుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ నాలుగు నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19,919 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది ఒకే రోజులో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం. ఇది రైల్వే, మెట్రో ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుంది కేంద్రం. రేర్ ఎర్త్ పథకం దేశ సాంకేతికతకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# దూసుకొస్తున్న సెన్యార్ తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

కదులుతూ తీవ్రఅల్పపీడనంగా మారే అవకాశం ఉందంది. ఆ తదుపరి 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. మలక్కా జలసంధి ప్రాంతంలో సెన్యార్ తుఫాన్ గా బలపడిన తీవ్రవాయుగుండం. ఈ తుపానుకు 'సెన్యార్'గా నామకరణం చేశారు. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. విశాఖపట్నం, కొనసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. తమిళనాడులో పలు జిల్లాలకు అలర్ట్ ప్రకటించారు. మలక్కా జలసంధి ప్రాంతాల్లో తీవ్రవాయుగుండం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఈరోజు తుపానుగా బలపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించింది.అల్పపీడనం, తుపాను ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు (నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2) కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరి కోతలు జోరుగా సాగుతున్న క్రమంలో వెంటనే కుప్పలు వేసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది.పండిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరచుకోవాలని, తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలి సూచించింది. రంగుమారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని అన్నదాతలకు సూచించింది.

# రేవంత్ మిషన్ కమీషన్

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ కుంభకోణంలో దాదాపు 30 నుంచి 40 శాతం కమీషన్లు దండుకోబోతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏది మాట్లాడినా, ఏం చేసినా.. ఏది చెయ్యకున్నా దాని వెనుక ఒకే ఒక్క మిషన్ ఉంటుందనీ, అదే కమీషన్ అని అన్నారు. ఏ స్కీంను ఎలా పటిష్టంగా అమలు చేయాలి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మంత్రివర్గం చర్చిస్తుందనీ, కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని మంత్రివర్గం స్కాంల గురించి ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ఓ దండుపాళ్యం బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, కాంగ్రెస్ పాలన బడా స్కాంలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. వాటాలు, పంపకాల్లో తేడా రావడంతో మంత్రులే బయటకు వచ్చి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటున్నారని గుర్తు చేశారు. హెచ్ఐఎల్‌టీపీ విధానం సీఎం ఒక్కరి నిర్ణయ ం కాదనీ, మంత్రివర్గ ఉపసంఘానిది అని మంత్రులు మాట్లాడారని అన్నారు. ఈ స్కాంలలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులందరికీ వాటా ఉందన్నారు.

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని హరీశ్‌రావు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఎన్టీపీసీ, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామనీ, ఏది తక్కువ వ్యయంతో నిర్మిస్తే దానికే అవకాశం ఇస్తామంటున్నారని అన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.12.23 కోట్ల ఖర్చు అవుతుందంటూ ఎన్టీపీసీ చెప్పిందన్నారు. అదే విధంగా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.14 కోట్లు ఖర్చవుతాయంటూ జెన్‌కో పేర్కొందని వివరించారు. ఎన్టీపీసీ, జెన్‌కో డీపీఆర్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక మెగావాట్ ఉత్పత్తికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.8.63 కోట్లు, భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో రూ.9.74 కోట్లు, ఎన్టీపీసీలో రూ.12.23 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. కమీషన్లు దండుకోవడానికి జెన్‌కోకు రూ.14 కోట్లకు ఖరారు చేసే అవకాశముందన్నారు. ఒక్కో మెగావాట్‌కు రూ.5,600 కోట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. రామగుండంలో ప్రాజెక్టు వ్యయం రూ.10,880 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెరుగుతుందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో రూ.నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. దాని ఉత్పత్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. రేవంత్‌రెడ్డి అపరిచితుడు, చంద్రముఖిలా మారిపోతున్నారని చెప్పారు.

విద్యుత్‌ను అదానీ, అంబానీకి ఇచ్చేందుకు కుట్ర

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం తెస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. పథకాల కోసం ఒక డిస్కం ఏర్పాటు చేస్తే లాభాలు వచ్చే డిస్కంలను అంబానీ, అదానీలకు ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర జరుగుతున్నదని అన్నారు. ఆదాయమే రాని డిస్కంల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం డైరెక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి యాక్షన్ చేస్తున్నారని అన్నారు. త్వరలో హైదరాబాద్ అండర్ గ్రౌండ్ కేబుల్ స్కాం, పంపుడ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ స్కాం బయటపెడుతామన్నారు. త్వరలో రేవంత్‌రెడ్డి చేసే ఇంటర్ స్టేట్ స్కాంను ఆధారాలతో సహా బయటపెడతామని చెప్పారు. తాము ప్రతిపక్షంగా ప్రజల తరుపున ప్రభుత్వ స్కాంలు, అన్యాయాలపై ప్రశ్నిస్తే తమపై విచారణలంటూ బెదిరిస్తున్నారని అన్నారు. ఈ స్కాంలపై అవసరమైతే బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతుందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కాకుంటే ఈ స్కాంలపై విచారణ జరపాలనీ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు రైతుల ఉసురు తగులుతుంది

(మొదటి పేజీ తరువాయి)

ఈరోజు తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లెలో అరటి తోటలను పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జగన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో టన్ను అరటి ధర రూ.30 వేల వరకు పలికిందని గుర్తు చేశారు. అరటి ఎగుమతుల కోసం అనంతపురం-ఢిల్లీ, తాడిపత్రి-ముంబైకి ప్రత్యేక రైళ్లను కూడా నడిపామని, కానీ ఇప్పుడు టన్ను రూ.2 వేలకు కూడా కొనేవారు లేక పంట చెట్లపైనే మాగిపోతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి రైతులపై ప్రేమ లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు.గత 18 నెలల కాలంలో రాష్ట్రంలో 16 సార్లు విపత్తులు సంభవించినా, రైతులకు ఒక్క రూపాయి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ అందించలేదని జగన్ ఆరోపించారు. తమ హయాంలో సీజన్ ముగిసేలోపే పరిహారం అందించామని తెలిపారు. "వ్యవసాయం దండగ అని చంద్రబాబు నమ్ముతారు. అందుకే అన్నదాత సుఖీభవ హామీని నిలబెట్టుకోలేదు. రైతులు ఎరువులను సైతం బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని కల్పించారు" అని మండిపడ్డారు.

అరటి మాత్రమే కాకుండా మిర్చి, పసుపు, పొగాకు వంటి ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబుకు రైతుల ఉసురు తప్పకుండా తగులుతుందని, ఈ కూటమి ప్రభుత్వం త్వరలోనే బంగాళాఖాతంలో కలవడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

# నేటి నుంచినామినేషన్లు

హైదరాబాద్,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**

గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె బుధవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, సీనియర్ అధికారులతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల వారీగా కేటాయించాలని సూచించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. నోటీసు జారీ, రిటర్నింగ్ అధికారిచే వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శనలో వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఉపేక్షించరాదనీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు, సజావుగా, స్వేచ్ఛగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**

సర్పంచ్ ఎన్నికల మొదటి విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఉదయం గ్రామ పోలింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ చేసిన తర్వాత వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు జరగనున్నాయి.

# ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

. బెంగుళూరు-హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఎయిరోస్పేస్ రంగంలో, ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతోపాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. తెలంగాణపై ఎంతో నమ్మకంతో సాఫ్రన్ గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్టమొదటి సెంటరని సీఎం వివరించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌తోపాటు సాఫ్రన్‌కు చెందిన ఎం-88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాల్‌కు శంకు స్థాపన చేయటం హర్షనీయమని అన్నారు. భారత వైమానిక దళం, నావికా దళానికి ఇది ఎంతో ఉపయోగపడుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాఫ్రన్ దాదాపు రూ.1,300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణు లు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానిం చడంతోపాటు పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచింద ని పేర్కొన్నారు. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఈజెడ్‌లు



ప్రముఖ కంపెనీల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయని గుర్తుచేశారు. గత తొమ్మిది నెలల్లో ఎగుమతులు రూ.30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతు లను అధిగమిం చాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందిందని చెప్పారు.

రాష్ట్రంలో నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా విమానాల నిర్వహణకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే అంశంపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతోందని సీఎం చెప్పారు. నైపుణ్యాలను మెరుగుపరచడానికి టాటా టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దామని వివరించారు. ప్రపంచ దేశాల్లోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలన్న సంకల్పంతో హైదరాబాద్ విమానా శ్రయం సమీపంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వాని స్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. భారత లక్ష్యాలను చేరుకోవడంలో తెలంగాణ భాగస్వామిగా ఉండాలని ఆకాంక్షించారు. అదే క్రమంలో 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం వివరించారు. కార్యక్రమం లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ రాస్ మెకలెన్స్, సీఈఓ, డైరెక్టర్ ఒలివర్ అండ్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సీఈవో స్టీఫేన్ క్యూయెల్, జీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జీఎం రావుతోపాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల విలీనం దారుణం

అదే విధంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త పురపాలికలు ఏర్పాటు చేశారు. తాండాలను అప్‌గ్రేడ్ చేసి 8,800 గ్రామ పంచాయతీలను 12,800కు పెంచడం జరిగింది. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది' అన్నారు.'ఈ విషయంలో ప్రభుత్వం ఎవరితో చర్చించిందో తెలియదు. ఎందుకంటే, మున్సిపాలిటీల్లో ఎలాంటి తీర్మానాలు జరగలేదు. ఏ ఒక్క మున్సిపాలిటీ నుంచి కూడా కనీసం తీర్మానం తీసుకోలేదు. మున్సిపాలిటీలు కొలువు తీరి లేవు కాబట్టి ప్రజలతో నేరుగా అభిప్రాయ సేకరణ చేశారా ? అంటే అదీ చేయలేదు. అఖిలపక్ష సమావేశం పెట్టి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకున్నారా ? శాసనసభ పెట్టి సభ్యుల అభిప్రాయం తీసుకున్నారా అంటే అదీ లేదు. మరి ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం, ఎవరి శాశ్వత దీర్ఘకాలిక ఆలోచనల కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందో మాకైతే తెలియడం లేదు. ఏ కారణం చేత ఈ ప్రతిపాదనను తెచ్చారో కూడా స్పష్టంగా లేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల ప్రయోజనాల కోసం మాత్రమే ఈ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది' అన్నారు.'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో కొత్త పాలసీని తీసుకువచ్చారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు అపార్ట్‌మెంట్లకు ఇస్తున్నారు. గతంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ప్రజలను ఒప్పించి, ఉపాధి అవకాశాల కోసం భూములను సేకరించిన తీరుగానే, గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరంలో 9,300 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించాయి. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకి భూములు తీసుకొని, వారికి తక్కువ ధర ఇచ్చి, సబ్సిడీపై పరిశ్రమలకు భూములిచ్చిన తర్వాత పరిశ్రమలు నడవాలి. ఉపాధి దొరకాలి. యువతకు ఉద్యోగాలు రావాలి. రాష్ట్ర ఆదాయం పెరగాలని మేము ఆశిస్తున్నాం. రేవంత్ రెడ్డి గారి వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. హైదరాబాద్‌లోని పరిశ్రమల యజమానులు వచ్చి,అపార్ట్‌మెంట్లు కట్టుకుంటాం, మాల్స్ కట్టుకుంటాం అంటే.. వారికి అడ్డికి పావుశేరు చొప్పున మార్కెట్ రిజిస్ట్రేషన్ ధరకు కాకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వాల్యూలో 30శాతం మాత్రమే చెల్లించి, భూమిని కన్వర్ట్ చేసుకోవడానికి రేవంత్ రెడ్డి అనుమతిస్తున్నాడు' అని ఆరోపించారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

(మొదటి పేజీ తరువాయి)

పంజాబీ, నేపాలీ, మరాఠీ, మళయాలం భాషల్లో ప్రచురించిన భారత రాజ్యాంగ గ్రంథం డిజిటల్ వర్షన్‌లను ఈ సందర్భంగా రాష్ట్రపతి విడుదల చేశారు. భారత్ కే సంవిధాన్ మే కళా ఔర్ కాలిగ్రఫీ శీర్షికతో ఒక స్మారక బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు.

రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట

ప్రజల స్వాభి మానాన్ని కాపాడే ఎన్నో హక్కులను రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి అని ఆమె స్పష్టం చేశారు. శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, అందులో భాగంగానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకొచ్చినట్టు రాష్ట్రపతి చెప్పారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని, ఆర్థిక ఏకీకరణలో భాగంగా జీఎస్టీ వ్యవస్థను తీసుకొచ్చామని అన్నారు.

# నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలా?

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మద్యం దుకాణాల నియంత్రణపై తమకు పూర్తి అధికారాలు లేనప్పటికీ, ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే వరకు తాము ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కనీసం రహదారిపైకి మద్యం దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను కూడా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని నాగారం మున్సిపల్, ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు సదరు మద్యం దుకాణం యజమానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు.పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త తెలుగు దిన పత్రిక
గురువారం 27 నవంబర్ 2025

# మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

**రాయపర్తి/నవంబర్ 26(జర్నలిస్ట్ వార్త):**కుటుంబ సమస్యల తో మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన భీముని యాదగిరి (52)వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనము కొనసాగిస్తున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం వివాహం చేసుకోగా ఇద్దరు కూతుళ్లు జన్మించారు. అనారోగ్య కారణాలతో మొదటి భార్య మృతి చెందడంతో రెండవ వివాహం చేసుకోగా ముగ్గురు కూతుళ్లు జన్మించారు. ఇద్దరి కూతుళ్లకు వివాహం జరిపించాడు.మిగతా ముగ్గురు కూతుర్ల వివాహం కుటుంబ పోషణ గురించి ఆలోచిస్తూ మనోవేదనకు గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. మంగళవారం అదే గ్రామానికి చెందిన రైతు ఎల్లయ్య పొలం పనులకు వెళ్తున్న క్రమంలో గ్రామ శివారు లో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు గుర్తించి. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకున్నారు.మృతుని తల్లి రామ లచ్చమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట హాస్పిటల్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు




**రాయపర్తి/నవంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల తహసిల్దార్ శ్రీనివాస్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.అనంతరం మండల బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల భారత రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బహుమతులు, లకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారే కృష్ణమూర్తి,దళిత రత్న అవార్డు గ్రహీత ఐత యాకయ్య, ఐత మల్లేష్,పాఠశాల ఉపాధ్యాయులు సుంకరి రాజు, ఉపేందర్, అంబేద్కర్ వాదులు ఐత సారయ్య, అయిత బాబు, గిద్దె ఎల్లయ్య, గారే బిక్షపతి, ఉబ్బని సింహాద్రి, అయిత అనిల్, సోడపు శ్రీనివాస్, చెడుపాక నాగేష్, అయిత యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న
## జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్




**భూపాలపల్లి/నవంబర్26 (జర్నలిస్ట్ వార్త):** కాలేశ్వరంలోని కాలేశ్వర%-%ముక్తేశ్వర స్వామి వారిని జిల్లా ఎస్పి సిరి శెట్టి సంకీర్ ఐపీఎస్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఎస్పీ మాట్లాడుతూ, రానున్న స్థానిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు పలు చోట్ల గుర్తించినట్లు, అక్కడ ప్రత్యేక పోలీస్ బలగాలను నియమించి నిఘా మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలను అందరూ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.

ప్రజలు మంచి నాయకుడిని తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించిన ఆయన, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకోవాలి

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి/నవంబర్26(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను, నాయకులను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టుకుని గెలిపించుకుని రావాలని పార్టీ శ్రేణులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. బుధవారం భూపాలపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్ళపల్లి, గణపురం మండలాల్లోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే నాయకులకు పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకోవాలని, వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విరిజర్వేషన్లు వచ్చిన గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడైనా ఆర్థికంగా బలహీనంగా ఉంటే, ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆ అభ్యర్థి విజయానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

## బయ్యారంలో ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు.



**బయ్యారం/నవంబర్26 (జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సుదర్శన చార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు.ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకాలు,ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ కృష్ణా రెడ్డి,సెక్రటరీ కొల్లా వెంకటేశ్వరావు, పెద్దినేని వెంకటేశ్వరరావు,వైఎస్ రెడ్డి,తిరుపతి రావు,పూసులూరి మాధవరావు,సత్తి బాబు, గరిపల్లి శ్రీనివాస్,మహిళ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు బిక్ష




**గణపురం/నవంబర్26(జర్నలిస్ట్ వార్త):**
గణపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీ సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా అయ్యప్ప మాలధారణ స్వాములకు ఆలయ అర్చకులు ముసునూరు నరేష్ బిక్షను/అన్నప్రసాదన ను ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా వారి కుమారుల వీర మణికంఠ. శివ రుద్ర సాయంత్రం అయ్యప్ప స్వాములకు అల్పాహారంగా పండ్లను దక్షిణ తాంబూలాన్ని సమర్పించారు

## అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



**కొత్తగూడెం/నవంబర్26 (జర్నలిస్ట్ వార్త):** సుజాతనగర్ మండలం సీతంపేట బంజరలో జరిగిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో అయ్యప్ప పడిపూజలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామివారి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామివారి కృప, చల్లనిచూపు తప్పక ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు

## పల్లెల్లో కాక రేపుతున్న రాజకీయం

### సమరానికి సిద్ధమవుతున్న టీడీపీ

**ఖమ్మంబ్యూరో/నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి సృష్టిస్తోంది. గ్రామాల్లో వాతావరణం రాజకీయ చర్చలతో రగులుతుండగా, టీడీపీ వచ్చే పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ టీడీపీ సమావేశం గురువారం సాయంత్రం 3 గంటలకు ఖమ్మం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరగనుంది. ఈ సమావేశానికి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షత వహించనున్నారు.
సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ పరిధిలోని గ్రామపంచాయితీల ఎన్నికల్లో పోటీపై తుది నిర్ణయం, అభ్యర్థుల ఎంపిక, వ్యూహరచనపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అన్ని స్థాయిల పార్టీ నాయకులు, మండల ఇన్‌ఛార్జిలు, కీలక నాయకులు సమావేశానికి హాజరుకావాలని పార్టీ కోరింది. రాబోయే ఎన్నికల్లో బలం చాటేందుకు టీడీపీ పగ్గాలు బిగించింది



# ఎస్టీ కులాలకు పెరుగుతున్న అన్యాయం!

## -రిజర్వేషన్ రోటేషన్ ఎక్కడ..? హక్కులు ఎక్కడ..?

**హుజురాబాద్/నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎస్టీ కులాలకు తీరని అన్యాయం జరుగుతోందని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు పూతాడి శ్రీనివాస్, కుతాడు తిరుపతి కుమారస్వామి మండిపడ్డారు. 2025 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క గ్రామంలోనూ ఎస్టీలకు సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాలు ఇవ్వకపోవడం తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోందన్నారు.
2019లో మాత్రంవీణవంక మండలం హిమ్మత్‌నగర్ సర్పంచ్, కోర్కల్ వార్డ్ మెంబర్, మానకొండూరు మండలం పోచంపల్లి సర్పంచ్, మానకొండూరు గ్రామం వార్డ్ మెంబర్, కొత్తపల్లి



మండలం చింతకుంట సర్పంచ్, జమ్మికుంట మండలం మాచినపల్లి వార్డ్ మెంబర్ ఇలా అనేక చోట్ల ఎస్టీలకు అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు.“ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ ప్రకారం రోటేషన్ విధానం ఉండాలి%ౌ% అది ఎక్కడ నడుస్తోంది..?ఎస్టీల హక్కులు ఎక్కడ..?” అని నాయకులు ప్రశ్నించారు.రొటేషన్ ప్రక్రియను పట్టించుకోకుండా, రిజర్వేషన్లను వక్రీకరించారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ వెంటనే రిజర్వేషన్ పద్ధతిలో సవరణలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో ఎస్టీ కులాలపై రాజకీయంగా, సామాజికంగా అన్యాయం పెరిగిపోతోంది%ౌ% దీనిని అరికట్టేది ఎవరు?” అని నాయకులు వేదన వ్యక్తం చేశారు. సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగమే దేశానికి దిక్సూచి

### ఘనంగా 76వ భారత రాజ్యాంగ దినోత్సవం

### తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి

**నెక్కొండ/నవంబర్ 26(జర్నలిస్ట్ వార్త):**
నెక్కొండ మండలం తోపనపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 76వ భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం సంఘం ఇంచార్జ్ తుల్ల యాకయ్య, కళాకారుల అధ్యక్షులు అలువాల మహేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి హాజరై మాట్లాడుతూ ప్రపంచానికి ఆదర్శవంతమైన, అతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగంగా, సర్వసమానాలకు, స్వేచ్ఛాయుత జీవనానికి చట్టబద్ధంగా కల్పించబడింది, భారత రాజ్యాంగం 395 ఆర్టికల్స్ తో ,8 అంగాలు 22 అంశాలతో రూపొందించిన రాజ్యాంగాన్ని భారత ప్రజలకు అందించడం జరిగింది, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు వ్రాసి భారతదేశంలో దిశా,నిర్దేశాంగా అందించడం జరిగిందన్నారు, భారత రాజ్యాంగ పీఠిక భారతదేశంలో సర్వసత్తాక, సార్వభౌమ్య,స్వామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రంగా నెలకొల్పుటకు, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయాన్ని,భావము, భావ ప్రకటన విశ్వాసము, ధర్మం, ఆధారములతో



కూడిన స్వేచ్ఛ సాధించాలని, అంతస్తులను అవకాశంలోనూ సమానత్వమును చేర్చుటకు అందరిలో వ్యక్తి గౌరవాన్ని పెంపొందించుకొని, చట్టబద్ధం చేసుకుని, మనకు మనమే సమర్పించుకున్నామనీ, భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26 తేదీన రాజ్యాంగ పరిశత్ ఆమోదింపబడి, 1950 జనవరి 26 నుండి అమలులోకి రావడం జరిగిందన్నారు,భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయడం జరిగినది, ఇంకా ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల కన్వీనింగ్ కమిటీ సభ్యులు పోలిశెట్టి భాను ప్రకాష్, ఇటికాల సంజీవ, గ్రామ శాఖ సభ్యులు దేవులపల్లి వెంకటయ్య మునియ ప్రకాశం,ఐతె మాణిక్యం, కొత్తపల్లి లచ్చయ్య, పందుల వీరస్వామి, ఆరూరి ఏలియా, మునిగె చిన్న శ్రీనివాస్, కొత్తపల్లి రాజశేఖర్, మొగిలి, ఆరూరి కృష్ణ, కొంగరి శ్రీధర్, మందుల మురేష్,మునిగే రేణుక తదితరులు పాల్గొన్నారు

# 3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం బ్యూరో,/నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 566 గ్రామ పంచాయతీ సర్పంచ్, 566 ఉప సర్పంచ్, 5168 వార్డు సభ్యుల ఎన్నిక 3 విడతల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11న 7 మండలాల్లోని 192 గ్రామాలు, 1740 వార్డులకు, రెండవ విడత డిసెంబర్ 14న 6 మండలాల్లోని 183 గ్రామాలు, 1686 వార్డులకు, మూడవ విడత డిసెంబర్ 17న 7 మండలాల్లోని 191 గ్రామాలు, 1742 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోలింగ్, కౌంటింగ్ ఒకే రోజు జరుగుతాయని, ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విడత పంచాయతీలకు నవంబర్ 27న, రెండవ విడత పంచాయతీలకు నవంబర్ 30న, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి 3 రోజుల పాటు నామినేషన్లకు, తర్వాతి రోజు నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉంటుందని, మరుసటి రోజు అప్పీళ్లను స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు.

నామినేషన్ల ఉపసంహరణ మొదటి విడత పంచాయతీలకు డిసెంబర్ 3, రెండవ విడత పంచాయతీలకు డిసెంబర్ 6, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 9 మధ్యాహ్నం మూడు గంటల వరకు సమయం ఉంటుందని, అదే రోజున పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసామని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం 166 ఎస్టి (మహిళలు 75, జనరల్ 91), 110 ఎస్సీ (మహిళలు 48, జనరల్ 62), 54 బీసి (మహిళలు 24, జనరల్ 30), 236 అన్ రిజర్వ్ క్యాటగిరి (మహిళలు 112, జనరల్ 124) లుగా రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 7 లక్షల 95 వేల 138 మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటా రని, 708 పోలింగ్ లొకేషన్ లలో 5168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, సర్పంచ్ ఎన్నికలకు 9 లక్షల 51 వేలు, వార్డు సభ్యుల ఎన్నికలకు 9 లక్షల 51 వేల బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశామని, 4894 జంబో, 852 మీడియం బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 566 రిటర్నింగ్ అధికారులు, 3442 పోలింగ్ అధికారులు, 4217 ఇతర పోలింగ్ అధికారులు, 15 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,15 స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, 76 జోనల్ అధికారులు, 25 టిఓటీ, 241 రూట్ అధికారులు నియమించామని, 20 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లు, 191 రిసెప్షన్ కేంద్రాలను, 566 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలలో గుర్తించిన 1858 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ కు ఏర్పాట్లు చేశామని, 648 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు నమోదు చేయాలనుకునే వారు 1077 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎంసిసి కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా ఎం.సి.ఎం.సి. అనుమతి తీసుకోవాలని అన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, జర్నలిస్టులు, వివిధ వర్గాల ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దేశంలో రాజ్యాంగమే సుప్రీం

**- ప్రొఫెసర్ గాదె సమ్మయ్య**

**హనుమకొండ/నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సదస్సు జరిగింది. విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. తరువాత మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో కష్టాలు, విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటూ భారత రాజ్యాంగాన్ని రచించిన ఘనత ప్రపంచంలో ఎవరికి దక్కలేదని అన్నారు. రాజ్యాంగ పరిషత్‌లో డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అంబేద్కర్‌కు తోడుగా ఉన్న సభ్యులలో కొందరు విదేశాలకు వెళ్లిపోవడం, మరికొందరు అనారోగ్యం కారణంగా సమయాన్ని కేటాయించలేకపోవడంతో రాజ్యాంగ రచనా భారాన్ని అంబేద్కర్ ఒంటరిగానే మోశారని పేర్కొన్నారు.

ప్రపంచంలోని ఎన్నో దేశాల రాజ్యాంగాలను స్వయంగా అధ్యయనం చేసి 2 ఏళ్లు 11 నెలలు 18 రోజులు శ్రమించి భారత రాజ్యాంగాన్ని సిద్ధం చేశారన్నారు. రాజ్యాంగంలో సమాన హక్కులు, మహిళా రక్షణ, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు, కార్మికుల హక్కులు, మత స్వేచ్ఛ ఇతర మహత్తర అంశాలను చేర్చడం అంబేద్కర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. ఆధునిక భారతదేశం ఈరోజు ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుంటే“%% అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం చలువే” అని సమ్మయ్య స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని అమలు చేసే వారు ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తే దేశం అంత వేగంగా ఎదుగుతుందని ఆయన చెప్పారు. రాజ్యాంగం లక్ష్యాలు విఫలమైతే అది ప్రజలందరి వైఫల్యమని హెచ్చరించారు.కొన్ని శక్తులు రాజ్యాంగ మార్పుల దిశగా కదులుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి రాజ్యాంగ రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ (డైరెక్టర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్), డాక్టర్ గడ్డం కృష్ణయ్య (బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ పొలిటికల్ సైన్స్), డాక్టర్ వి. సత్యనారాయణ, డాక్టర్ ఏ. నాగరాజు, డాక్టర్ ఆకులపల్లి కుమార్తో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


















## నకిలీ ఐఎఎస్ అవతారం

**ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు**

**హైదరాబాద్,ననవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** ఐఏఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసగిస్తున్న వ్యకిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్స్‌లోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చంపాపేటకు చెందిన బత్తిని శశికాంత్ ఏనిమేషన్ కోర్సు చేసి చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. ఇతని స్వస్థలం ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఇటీవల షేక్‌పేటలోని అపర్ణ ఔరా అపార్టుమెంట్‌కు మకాం మార్చాడు. నేర్చుకున్న ఏనిమేషన్ కోర్సును ఉపయోగించి తన పేరిట నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్‌ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేశాడు. పోలీసు, ఎన్‌ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని నమ్మబలుకుతూ తిరుగుతుండేవాడు. తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. కసరత్తు చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్‌కాగా ప్రత్యేక ఆపరేషన్‌కు వెళుతున్నానంటూ హడావిడిగా జిమ్ నుంచి బయటికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో టీఎస్‌ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ జిమ్ ఎండీ అలీ హసన్‌కు చెప్పాడు. పరిశ్రమ స్థాపన కోసం స్థలం కేటాయింపు జరిగిదంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్ తయారు చేసి అలీ హసన్‌కు చూపించి, రూ.10.50 లక్షల నగదు బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి రూ.10లక్షలు వసూలు చేశాడు. కేటాయింపు జరిగిందని చూపించిన స్థలం తన పేరుపై బదిలీ కాకపోవడంతో అలీ హసన్‌కు ఇతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శశికాంత్‌ను అరెస్టు చేసి రెండు చరవాణులు, ఆరు సిమ్‌కార్డులు, రెండు వాకీటాకీలు, నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్‌ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# సర్పంచ్, వార్డు మెంబర్ నామినేషన్ విధానాలు




**సత్తుపల్లి/నవంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** సర్పంచ్, వార్డు మెంబర్ నామినేషన్ విధానాలు ఇలా

నామినేషన్ వేసే వ్యక్తి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. అభ్యర్థి, ప్రతిపాదకుడు సంతకం చేసిన నామినేషన్ ఉదయం 10.30 నుండి 5 గంటల లోపు సమర్పించాలి.ప్రతిపాదకుడు కచ్చితంగా సంబంధిత వార్డు ఓటర్ లిస్టులో నమోదుఅయి ఉండాలి. అభ్యర్థి ఆ గ్రామంలో ఓటరుగా నమోదు అయి ఉండాలి. అభ్యర్థి, ప్రతిపాదకుడు ఇంటి టాక్స్ కట్టి గ్రామ పంచాయతీ నుండి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకోవాలి.

డిపాజిట్ రుసుము సర్పంచ్ అభ్యర్థికి 2000 వార్డు అభ్యర్థికి 500 ఏస్ సి, ఏస్ టీ, బి సి కుల ధృవీకరణ ఇవ్వాలి లేదంటే నామినేషన్ ఫారం లోని పార్ట్ బిఎఎ లో డిప్యూటీ తహసీల్దార్ సంతకం చేయించాలి.

రిజర్వుడు కేటగిరి అభ్యర్థుల డిపాజిట్ రుసుము సర్పంచి అభ్యర్థికి 1000 వార్డు అభ్యర్థికి 250

ఇద్దరు సాక్షుల స్వీయ ధృవీకరణ అన్ని గడులు పూరించి ఇవ్వాలి.రిటర్నింగ్ అధికారి సమక్షం లో ఎన్నికల ఖర్చు ఖాతా నిర్వహిస్తానని చెప్పే డిక్లరేషన్ పై సంతకం చేసి ఇవ్వాలి. అభ్యర్థి తన గుర్తింపు కార్డు కొరకు ఫోటోను సమర్పించాలిస్కూటీని రోజున నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదురుగా హాజరు కావాలి

## గొల్లగూడెం సర్పంచ్ బరిలో టిడిపి నేత

**గ్రామంలో రాజకీయ చర్చలు వేడెక్కింతే!**



**తల్లాడ/నవంబర్26(జర్నలిస్ట్ వార్త):** గొల్లగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ పట్టానికి టిడిపి నుంచి ఒక శక్తివంతమైన నాయకుడు రంగంలోకి దిగనుండటంతో గ్రామ రాజకీయాలు కొత్త ఊపుకు లోనవుతున్నాయి. మరికొన్ని రోజుల్లో అధికారికంగా అభ్యర్థి పేరును ప్రకటించబోతున్నారని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

గ్రామ సర్పంచ్ స్థానం జనరల్కు కేటాయించడంతో ఆయనను టిడిపి, బిజెపి, జనసేన, ఎమ్మార్పీఎస్ స్థానిక నేతలు ఇప్పటికే సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. పంచాయతీలో అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు, అందరితో తత్సంబంధాలు కలిగిన వ్యక్తిగా ఆయన్ను గ్రామస్తులు చూసే తీరు ఆయనకు అదనపు బలం కానుంది. గొల్లగూడెంలో టిడిపికి ఊపు తెచ్చిన నాయకుడిగా ఆయన్ను కార్యకర్తలు గుర్తిస్తున్నారు. సండ్ర వెంకట వీరయ్య ఎమ్మెల్యేగా రెండు సార్లు పోటీ చేసినప్పుడు భారీగా ప్రజలను సమీకరించి పార్టీకి అండగా నిలిచిన నాయకుల్లో ఈయన ముందుంచబడతారు.సర్పంచ్‌గా పోటీ చేస్తే పంచాయతీలో బలమైన సమీకరణాలు ఆయనదే అవుతాయని గ్రామస్థుల అంచనా. మంచి పేరు, ప్రజల్లో విశ్వాసం ఉన్న ఈ నేత బరిలోకి దిగితే గొల్లగూడెం రాజకీయాలు కొత్త మలుపు తిరగడం ఖాయమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గొల్లగూడెం ఇప్పుడు ఒక్క మాటే ూ “టిడిపి అభ్యర్థి ఎవరన్న దానిపైనే అందరి కళ్లూ!”

## నాగులవంచలో విషాదం

**- కరెంట్ షాక్‌కు ఎలక్ట్రీషన్ బలి**



**నాగులవంచ/నవంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన చెట్టుపోగు రంగయ్య (37) పై కరెంట్ పంజా విసిరింది. ప్రైవేట్ ఎలక్ట్రీషన్ హెల్పర్‌గా పని చేస్తున్న రంగయ్య, గ్రామానికి సమీపంలోని చిన్న చెరువు వాగు వద్ద మోటర్ ఫిట్ చేస్తుండగా అకస్మాత్తుగా కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంటనే గుర్తించిన స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా ఫిట్స్‌కి గురై మృతి



**వర్ధన్నపేట/నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొండేటి బాబు, వడ్లు లోడ్ చేసి మార్కెట్‌కి వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కుప్పకూలాడు. స్థానికులు వెంటనే బాబును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, వైద్యులు అతని మృతి స్థిరంగా ప్రకటించారు. ప్రమాద సమయంలో చుట్టుపక్కల ఎవరికి గాయాలు కాలేదని, స్థానిక పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలిస్తూ, పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్ మాట్లాడుతూ ట్రాక్టర్ లేదా వాహనాలను నడుపుతున్న వ్యక్తులు ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకుని, ఎలాంటి అనారోగ్యం అనిపిస్తే వెంటనే వాహనాన్ని ఆపి జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# అవినీతి కేసుల్లో ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ పై సస్పెన్షన్

**వరంగల్/నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అవినీతి గందరగోళం బయటకు రావడంతో, సీపీ సన్ ప్రీత్ సింగ్ కఠిన చర్యలకు దిగారు. మామునూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ రమేష్ పలు కేసుల్లో అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించగా, అతనికి సహకరించిన కానిస్టేబుల్ రఘు కూడా సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో రమేష్‌ను మామునూర్ నుండి కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేసినప్పటికీ, డిపార్ట్‌మెంట్ విచారణలో అతని పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలింది. దీంతో ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ ఇద్దరిపై సస్పెన్షన్ అమలు చేశారు.పోలీస్ శాఖలో అవినీతి చర్యలను ఎదుర్కొని శుద్ధి చేపట్టడం ముఖ్యమని సీపీ తెలిపారు.

## సంక్రాంతి వరకు ఆప్కో వస్త్రాలపై రిబేటు

అమరావతి,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**రాష్ట్ర ప్రజలకు ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాలపై 40 శాతం రాయితీని సంక్రాంతి వరకూ అమలు చేయనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రవేశపెట్టిన రాయితీని ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో సక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయితీ అమ్మకాలతో ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుగుతుందన్నారు. అలాగే వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తుందని తెలిపారు. రాయితీ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షోరూమ్‌లలో రోజుకు సరాసరి రూ.3 లక్షలు చొప్పున విక్రయాలు జరిగేవని, రాయితీ ఇవ్వడంతో ప్రస్తుతం రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు.

## అత్తింటి వేధింపులకు అల్లుడు బలి..!

హైదరాబాద్, **నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**




భార్య కాపురానికి రాకపోవడంతో పాటు అత్తింటి నుంచి వేధింపులు ఎదురవడంతో ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించిన అల్లుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ (32)కు జగిత్యాల జిల్లా మెట్పల్లికి చెందిన పూజతో సుమారు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. అయితే వివాహం అయినప్పటినుంచి వేరు కాపురం పెట్టాలని భార్య, అత్తమామలు హరి ప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చారు. కాగా ఈ విషయంలో దంపతులిద్దరి మధ్య గొడవలు కావడంతో, తరచూ కూతురును తీసుకొని పూజ తన పుట్టింటికి వెళ్లిపోయేది. ఈ క్రమంలోనే ఈ నెల 2న పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా .. అక్కడ అందరి ముందు తన కుమారుడిని దుర్భాషలాడి, విషం తాగి ఆత్మహత్య చేసుకోవాలని తన కుమారుడ్ని రెచ్చగొట్టారని హరిప్రసాద్ తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ అనంతరం పూజ కుమార్తెను తీసుకుని వెల్దుర్తిలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ క్ర మంలో హరిప్రసాద్ ఈ నెల 18న వెల్దుర్తిలోని అత్తారింటిముందు పురుగులమందు తాగాడు. చుట్టుపక్కల వారి సాయంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తన కుమారుడి మృతికి అతని భార్య పూజ, అత్తమామలు వరలక్ష్మి, కిషన్లతో పాటు బంధువులు రామాంజనేయులు, కిరణ్, శ్రీవాణిలు కారణమంటూ మృతుడి తండ్రి మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

..

## వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

**పశ్చిమ -వాయువ్య దిశగా పయనం**

**తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన**




హైదరాబాద్,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ%-%వాయువ్య దిశలో కదిలి మరింతగా బలపడనుంది. మధ్య బంగాళాఖాతానికి చేరే క్రమంలో బలహీనపడనుంది. అటు బుధ, గురువారాల్లో వాయుగుండం దిశపై మరింత స్పష్టత లభించే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే శ్రీలంక%-%నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో మరొక అల్పపీడనం ఏర్పడింది. బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. తర్వాతి 24 గంటల్లో ఇది కూడా వాయుగుండంగా బలపడే ఛాన్స్ ఉందన్నారు. రెండు వాయుగుండాలు ఉత్తర తమిళనాడు తీరం దిశగా కదలనున్నాయని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత కోస్తాంధ్ర వైపునకు చేరుకుని బలహీనపడనున్నాయి. నవంబర్ 30, డిసెంబర్ 1న తెలంగాణలో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.మరోవైపు వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో చలి తగ్గింది. మెదక్‌లో 13.8 డిగ్రీలు, పటాన్ చెరువులో 14.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 14.7 డిగ్రీలు, హయత్ నగర్‌లో 15 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 17 డిగ్రీలు, హనుమకొండలో 17.5 డిగ్రీలు, రామగుండంలో 17.5 డిగ్రీలు, నిజామాబాద్‌లో 17.6 డిగ్రీలు, దుండిగల్‌లో 17.7 డిగ్రీలు, నల్లగొండలో 18.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 18.2 డిగ్రీలు, హకింపేట్‌లో 18.7 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 19.1 డిగ్రీలు, ఖమ్మంలో 20.4 డిగ్రీలు, భద్రాచలంలో 20.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఏపీపై కూడా వాయుగుండం ప్రభావం పడనుంది. రేపటి నుంచి మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లరాదని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లినవారు వెంటనే తిరిగి ఒడ్డుకి రావాలని సూచించింది. వాతావరణ ప్రభావంతో నవంబర్ 29 %-% డిసెంబర్ 2 వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయంది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలంది.

....

# ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ ఎస్సీ మహిళా రిజర్వేషన్‌తో మారిన రాజకీయ సమీకరణాలు

**హనుమకొండ బ్యూరో /ధర్మసాగర్ 26 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ పీఠం ఈసారి ఎస్సీ మహిళా రిజర్వేషన్‌గా ప్రకటించడంతో స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చలు, కొత్త లెక్కలు మొదలయ్యాయి. సుమారు 8 వేలపైచిలుకు ఓటర్లున్న ఈ పంచాయతీలో 14 వార్డులు ఉండగా, ప్రతి వర్గం తమకు అనుకూల అభ్యర్థిని రంగంలోకి దించాలని ప్రయత్నాలు వేగవంతం చేసింది. గ్రామంలో పెద్దఎత్తున కుల సంఘాల భేటీలు జరుగుతుండగా, ఏ అభ్యర్థి గెలుపు అవకాశముందన్న అంశంపై పెద్దలు, యువత, సంఘ నాయకులు విస్తృతంగా చర్చిస్తున్నారు. ముఖ్యంగా ఇంతకాలం గ్రామంలో ప్రభావం చూపిన నాయకులపై గుర్తింపుల చర్చ నడుస్తోంది. రాజకీయ పార్టీల వర్గాలు కూడా తమ లెక్కలు వేసుకుంటూ, డబ్బు బలం, ప్రజాదరణ, సేవాభావం, వర్గీకరణ అన్నింటినీ దృష్టిలో ఉంచుకుని




బలమైన అభ్యర్థిని కనుగొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది ఎస్సీ మహిళా రిజర్వేషన్ కావడంతో గ్రామ రాజకీయాల్లో కొత్త ముఖాలకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇంతకాలం పంచాయతీ ఎన్నికలలో పోటీ చేయని మహిళలకు ఈసారి పోటీ చేయాలన్న ఉత్సాహం కనిపిస్తోంది. గ్రామంలో శానిటేషన్, తాగునీరు, కాలువలు, రహదారులు, స్ట్రీట్‌లైట్లు, పాఠశాలల అభివృద్ధి వంటి ప్రాథమిక సమస్యలను పరిష్కరించగలిగిన అభ్యర్థినే ముందుకు తేవాలని ప్రజలు భావిస్తున్నారు. ఓటర్ల సమీకరణలు, వార్డు వారీగా ఆధిపత్యం, పార్టీ నాయకుల ప్రభావం, స్థానిక సంఘాల మద్దతుఅన్నీ కలిసి ఎవరి వైపు మొగ్గుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సాంప్రదాయంగా కాంగ్రెస్‌కు బలమైన ఓటింగ్ ఉన్న స్థానిక ఎలక్షన్లో పనిచేయడం లేదు గత ముగ్గురు సర్పంచ్‌ల పనితీరు, పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి వేగం ఈసారైనా ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపే అవకాశముంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మొదలైన తర్వాత గ్రామ రాజకీయాలు ఇంకా వేడెక్కే అవకాశం ఉంది. ఎస్సీ మహిళా రిజర్వేషన్‌తో ధర్మసాగర్ పీఠం ఎవరికి దక్కుతుందనే ప్రశ్న ఇప్పుడు గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది.


# వర్ధన్నపేట మండల లిస్టులో అక్షరదోషాల తడాఖా

## ప్రజల్లో చర్చనీయాంశంగా మారిన ఎన్నికల శాఖ నిర్లక్ష్యం







| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| వరంగల్ | వర్ధన్నపేట | 7 | రాంధాన్ తండా | 8 | నర్సంపేట | దు |
| వరంగల్ | వర్ధన్నపేట | | కత్రియాల | 10 | నర్సంపేట్ | దు |
| వరంగల్ | వర్ధన్నపేట్ | | ధమ్మన్నపేట్ | 12 | నర్సంపేట్ | దు |
| వరంగల్ | వర్ధన్నపేట్ | 10 | దివిటిపల్లి | 8 | నర్సంపేట్ | దు |
| | వర్ధన్నపేట్ | 11 | ఇల్లందు | 14 | నర్సంపేట్ | దు |
| వరంగల్ | వర్ధన్నపేట్ | 12 | కడారిగూడెం | 8 | నర్సంపేట్ | దు |
| వరంగల్ | వర్ధన్నపేట్ | 13 | కొత్తపెల్లి | 10 | నర్సంపేట్ | దు |
| | వర్ధన్నపేట్ | 14 | లైబర్తి | 10 | నర్సంపేట్ | దు |




R.N.I. No. TELMUL/2016/73158.
HSE No. 1051/2023-2025.
[Price: ₹. : 5-00.
RIGHT TO INFORMATION
తెలంగాణ రాజ పత్రము
THE TELANGANA GAZETTE
PART-VII EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY
No. 60] HYDERABAD, TUESDAY, NOVEMBER 25, 2025.
NOTIFICATIONS RELATING TO THE ADMINISTRATION OF PANCHAYAT RAJ
TELANGANA STATE ELECTION COMMISSION
అధికారిక ప్రకటన
నెం.1085/తె.రా.ఎ.సం.-పం.రా/2025 తేది: 25.11.2025

**వర్ధన్నపేట/నవంబర్26(జర్నలిస్ట్ వార్త):** స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలక్షన్ కమిషన్ పంపిన ఓటర్ల జాబితా వివాదాస్పదంగా మారింది. వర్ధన్నపేట మండలంలోని ఇల్లందు, లైబర్తే, కత్రియాల, దమ్మన్నపేట్ గ్రామాల పేర్లు వరుసగా నాలుగు చోట్ల తప్పుగా ప్రింట్ కావడం ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. అధికారులు పట్టికలను చెక్ చేశారా? లేక చూడకుండానే లిస్ట్‌ను విడుదల చేశారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. అక్షర దోషాలు ఉన్నప్పుడల్లా పదేపదే పరిశీలించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు%ఔ% ఈసారి ఎలా ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల పేర్లు సరిచూడకుండా, ఎలా పడితే అలా ప్రింట్ చేయడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముందు నిల్చబోతున్న అభ్యర్థులు, గ్రామ ప్రజలు ఈ తప్పిదాలపై




మండిపడుతున్నారు. తక్షణమే తప్పులను సరిచేసి ఖచ్చితమైన జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం ఎవరిది? ఎవరెవరూ చూసుకోవాలి? అన్న ప్రశ్నలకు అధికారులు స్పష్టతనివ్వాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలు అంటున్నారు.

# గ్రీవెన్స్ పై ఎమ్మెల్యేలు అలసత్వం

## 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులకు నోటీసులు -నారా లోకేష్ సంచలన నిర్ణయం

అమరావతి,**నవంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**

తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ, మంత్రి నారా లోకేశ్ జోనల్ కో-ఆర్డినేటర్లతో మంగళవారం మంగళగిరిలోని పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశం నిర్వహించారు. పార్టీపై నిర్లక్ష్యం, కార్యకర్తలను పట్టించుకోని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసిన లోకేశ్, గ్రీవెన్స్ మీటింగులు నిర్వహించని 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులకు ఫార్మల్ నోటీసులు జారీ చేయాలని జోనల్ ఇన్‌చార్జ్‌లకు ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేల్లో నిర్లక్ష్యం వద్దని నారా లోకేష్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ న్యాయం చేయడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. డిసెంబర్ 1 నుంచి పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. అదే సమయంలో, 10 రోజుల్లో పార్టీ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని, అంతకు ముందు అన్ని పెండింగ్ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు నాయకులు కార్యకర్తలను, ప్రజలను విస్మరిస్తున్నారని లోకేష్




అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ డేస్ నిర్వహించకపోవడం, ప్రజా దర్బార్‌లు ఏర్పాటు చేయకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యమన్నారు. ఇలాంటి 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు గుర్తించామని.. వారికి జోనల్ కో-ఆర్డినేటర్లు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ఇది ముందస్తు హెచ్చరిక అని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు ఎక్కువ మంది మంగళగిరి ప్రజా దర్బార్‌కు రావడం ఎందుకని ప్రశ్నించిన లోకేశ్, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో వారాంతాపు గ్రీవెన్స్ మీటింగులు నిర్వహించాలని, మంత్రులు కూడా టీడీపీ కార్యాలయం గ్రీవెన్స్ సెషన్లలో పాల్గొనాలని సూచించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టపడిన కార్యకర్తలను మరచిపోకూడదన్నారు. వారికి ప్రాధాన్యత, గౌరవం ఇవ్వడం మా బాధ్యత. ఈ బాధ్యతను తానే తీసుకుంటానన్నారు. అని చెప్పుకొచ్చారు. జోనల్ కో-ఆర్డినేటర్లు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి క్లస్టర్, యూనిట్, బూత్, కుటుంబ సాధికార సారథి కమిటీలతో సమావేశాలు నిర్వహించాలని, పెన్షన్ పంపిణీ స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాలు, క్యాడర్ రివ్యూలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలపై వివరణాత్మక రిపోర్టులు సమర్పించాలని, నాయకత్వం రివ్యూ చేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలు నియోజకవర్గ స్థాయిలోనే పరిష్కారం కావాలని నారా లోకేష్ భావిస్తున్నారు. అయితే చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. దాని వల్ల వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు చెప్పుకునేందుకు నారా లోకేష్ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నప్పుడు వస్తున్నారు.